నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
31 ఆగస్టు 2024
పేజీలు: 02




# అంబానీని మించిన అదానీ

గౌతమ్ అదానీ రికార్డు సృష్టించారు. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టారు. హురూన్ ఇండియా రిచ్‌లిస్ట్‌లో నం.1గా నిలిచారు. నిరుడుతో పోలిస్తే అంబానీ కుటుంబ సంపద 25% వృద్ధిచెంది రూ.10.14 లక్షల కోట్లకు చేరింది. అదానీ కుటుంబ ఆదాయం 95% వృద్ధిరేటుతో రూ.11.61 లక్షల కోట్లకు ఎగిసింది. ఇక శివనాడార్, సైరస్ పూనావాలా, దిలీప్ సంఘ్వి, బిర్లా, హిందూజా, దమానీ, ప్రేమ్‌జీ, నీరజ్ బజాజ్ కుటుంబాలు టాప్-10లో ఉన్నాయి.

## ఇండియాలో అత్యంత ధనవంతులు


| | | |
|---|---|---|
| 1.గౌతమ్ అదానీ రూ.11,61,800కోట్లు | 5.దిలీప్ సంఘ్వీ రూ.2,49,900కోట్లు | 9.అజీజ్ ప్రేమ్‌జి రూ.1,90,700 కోట్లు |
| 2.ముకేశ్ అంబానీ రూ.10,14,700కోట్లు | 6.కుమార్ మంగళం బిర్లా రూ.2,35,200కోట్లు | |
| 3.శివ్ నాడార్ రూ.3,14,000కోట్లు | 7.గోపిచంద్ హిందూజా రూ.1,92,700కోట్లు | 10.నీరజ్ బజాజ్ రూ.1,62,800 కోట్లు |
| 4.సైరస్ ఎస్ పూనావాలా రూ.2,89,800కోట్లు | 8.రాధాకిషన్ దమాని రూ.1,90,900కోట్లు | |



# యూఎస్ ఓపెన్‌లో జోకోవిచ్‌కు షాక్

యూఎస్ ఓపెన్ నుంచి డిఫెండింగ్ చాంపియన్ నోవాక్ జోకోవిచ్ నిష్క్రమించాడు. ఇవాళ జరిగిన మూడవ రౌండ్ మ్యాచ్‌లో 28వ సీడ్ ఆస్ట్రేలియా ప్లేయర్ అలెక్సీ పాపిరిన్ 6-4, 6-4, 2-6, 6-4 స్కోరు తేడాతో జోకోవిచ్‌పై గెలుపొందాడు. శుక్రవారం మరో స్టార్ ప్లేయర్ కార్లోస్ అల్కరాజ్ కూడా యూఎస్ ఓపెన్ నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే. రెండో సీడ్ జోకోవిచ్.. 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేశాడు. కానీ అతని దూకుడుకు యూఎస్ ఓపెన్‌లో తీవ్ర అడ్డు తగిలింది. జూన్‌లో మోకాలి సర్జరీ చేయించుకున్న జోకోవిచ్.. ఈ ఏడాది ఒక్క మేజర్ గ్రాండ్‌స్లామ్ కూడా గెలవలేకపోయాడు. 37 ఏళ్ల జోకోవిచ్ యూఎస్ ఓపెన్‌లో పది సార్లు ఫైనల్లోకి ప్రవేశించాడు. 2011, 2015, 2018, 2023లో టైటిల్స్ గెలిచాడు. శుక్రవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో అతను 14 సార్ల డబుల్ ఫాల్ట్ చేశాడు. శారీరకంగా అలసిపోయినట్లు కనిపించాడు.

# ఏపీ, తెలంగాణకు అతి భారీ వర్ష సూచన




భారత వాతావరణ శాఖ రిలీజ్ చేసిన తాజా బులిటెన్ ప్రకారం గుజరాత్ పక్కన తుపాను ఏర్పడింది. దానికి ఏస్నా అనే పేరు పెట్టారు. దాని ప్రభావం తెలుగు రాష్ట్రాలపై పెద్దగా లేనట్లే. బంగాళాఖాతంలో అల్పపీడనం.. బలంగా ఉంటూ.. వాయుగుండంగా మారుతోంది. ఇది పూర్తిగా వాయుగుండం అవ్వడానికి మరో 24 గంటలు పడుతుంది. ఇది ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా వైపు కదులుతోంది. మరోవైపు నైరుతీ రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయి. ఈ పరిస్థితి వల్ల తెలుగు రాష్ట్రాల్లో వారం పాటూ వానలు కురుస్తాయి. అలాగే ఇవాళ కోస్తాంధ్రలో అతి భారీ వర్షాలు కురుస్తాయి. తెలంగాణలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2 వరకూ అతి భారీ వర్షాలు కురుస్తాయి. అలాగే కోస్తాంధ్ర, యానాం, తెలంగాణలో సెప్టెంబర్ 3 వరకూ అక్కడక్కడా భారీ వర్షాలు కూడా కురుస్తాయి.శాటిలైట్స్ లైవ్ అంచనాలను గమనిస్తే, రాత్రి నుంచి కోస్తాంధ్ర, మధ్య తెలంగాణ, ఉత్తరాంధ్ర, హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ ఉదయం నుంచి మొత్తం తెలంగాణ అంతటా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి. ఏపీలో దక్షిణ రాయలసీమ తప్ప మిగతా అంతటా మోస్తరు, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. ఈ పరిస్థితి రోజంతా ఉంటుంది. అర్థరాత్రి తర్వాత కూడా ఉంటుంది. సెప్టెంబర్ 1న తెల్లవారుజాము తర్వాత ఏపీలో కొంత వాన తగ్గుతుంది. ఇవాళ హైదరాబాద్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఒక సర్కిల్ లాంటి సుడి హైదరాబాద్ పరిసరాల నుంచి బంగాళాఖాతం వరకూ కొనసాగుతోంది. ఉదయం వేళ భారీ వర్షాలు కురుస్తాయి. మళ్లీ సాయంత్రం వేళ భారీగా వర్షాలు కురిసే ఛాన్స్ కనిపిస్తోంది. జీహెచ్ఎంసీ అధికారులు ఆల్రెడీ అలర్ట్ అయ్యారు. ఆరెంజ్ అలర్ట్ కూడా జారీ చేశారు. అందువల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## గుడ్లవల్లేరు కాలేజీ ఘటన..

# నిందితురాలిని తప్పించిన కాలేజీ యాజమాన్యం

గుడివాడ సమీపంలోకి గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ గర్ల్స్ హస్టల్ వాష్రూమ్ లో హిడెన్ కెమరాల వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. రెండు నెలలుగా ఈ వ్యవహారం సాగుతుందని.. 300 వీడియోలు నిందితుల దగ్గర ఉన్నాయని తెలుస్తోంది. ఈ వ్యవహారం గురించి కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తే వారు సరిగా స్పందించకపోవడంతో.. విద్యార్థినులు ఆందోళనకు దిగారు. గురువారం అర్ధరాత్రి కాలేజీ ప్రాంగణంలో ఆందోళన చేయడమే కాక.. నిందితుడిపై దాడి చేశారు. బీటెక్ ఫైనలియర్ కు చెందిన ఓ విద్యార్థిని సాయంతో నిందితులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తుంది. ఇక కాలేజీలో ఉద్రిక్త వాతావరణం నెలకొని ఉండటంతో.. యాజమాన్యం సెలవులు ప్రకటించి.. విద్యార్థులను ఇంటికి పంపించింది. ఈక్రమంలో నిందిత విద్యార్థినికి సంబంధించి కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆ వివరాలు..గుడ్లవల్లేరు కాలేజీ హిడెన్ కెమరాల ఘటన వెనక ఉన్నది అదే కాలేజీకి చెందిన ఓ యువతి కావడం సంచలనంగా మారింది. ఆమె బాయ్ ఫ్రెండ్, మరికొందరు విద్యార్థులు కలిసి నిందితురాలిని బెదిరించడంతో ఇంతటి దారుణానికి ఒడిగట్టింది. కాలేజీలో ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం సదరు విద్యార్థినిని గుట్టు చప్పుడు కాకుండా కాలేజీ నుంచి



తప్పించినట్లు తెలుస్తోంది. పైగా ఇంతటి తప్పు చేసినప్పటికి.. సదరు విద్యార్థినిలో ఎలాంటి బెరుకు, భయం లేవని.. పైపెచ్చు.. రివర్స్ లో మిగతా స్టూడెంట్స్ ని బెదిరిస్తుందని విద్యార్థులు తెలిపారు. మిగతా విద్యార్థినులు ఆమెపై దాడి చేయడానికి యత్నించగా సదరు యువతి మిడిల్ ఫింగర్ చూపించడం గమనార్హం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతుంది.ఈ ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో అనేక ఆడియో క్లిప్స్ వైరల్ అవుతున్నాయి. విద్యార్థినిలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. అంతేకాక ఈ ఘటన మూడ్రోజుల క్రితమే తమ దృష్టికి వచ్చింది అంటూ స్టూడెంట్స్ వార్డెన్ తో చెప్పారు. అలాగే పోలీసులు, అధికారుల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఈ విషయాలపై అధికారులు కూడా స్పందిస్తూ.. సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకుందని వెల్లడించారు. ఐదుగురు మహిళా సిబ్బందితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. దీని వల్ల విద్యార్థుల కెరీర్ కి కూడా ఎలాంటి ఆటంకం జరగకుండా ఉండేలా చూస్తామంటూ అధికారులు హామీ ఇచ్చారు.



# దోషుల్ని శిక్షించాలంటూ నేడు మమత ధర్నా

బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శనివారం ధర్నా చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులు ఆందోళన చేపట్టాలని టీఎంసీ శ్రేణులకూ పిలుపునిచ్చారు. ఆర్జీకర్ వైద్యురాలి హత్యాచార దోషులకు మరణ దండన విధించాలని, రేప్ కేసుల్లో కఠినశిక్షలు పడేలా కేంద్ర చట్టాలను సవరించాలన్న డిమాండ్లతో ఆమె ఈ నిరసన చేపడుతున్నారు. మరోవైపు విద్యార్థులపై ఆమె నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా బీజేపీ ఏడు రోజుల ధర్నాకు పిలుపునివ్వడం గమనార్హం.



# థియేటర్లలోకి ట్రంప్ వివాదస్పద బయోపిక్!

డొనాల్డ్ ట్రంప్ బయోపిక్‌గా తెరకెక్కిన వివాదస్పద చిత్రం 'ది అప్రెంటిస్' థియేటర్లలోకి రానున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. యూఎస్‌లో పోలింగ్‌కు నెలరోజుల ముందు ఈ బయోపిక్ అక్కడి థియేటర్లలో విడుదల కానుందని నివేదికలు పేర్కొన్నారు. ఓ ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ దీనిని రిలీజ్ చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. కాగా ఈ సినిమాను గతంలో ట్రంప్ వ్యతిరేకించారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని ఆరోపించారు.



# రూటు మార్చిన రష్మిక


చాలా కాలంగా సరైన హిట్స్ లేని బాలీవుడ్ ఇండస్ట్రీకి మంచి రోజులొచ్చాయి. అజయ్ దేవ్‌గన్ నటించిన సైతాన్ సినిమాతో మంచి హిట్టందుకున్నాడు. జూన్‌లో విడుదలైన ముంజ్య సినిమా కూడా సూపర్ హిట్‌గా నిలిచింది. ఇటీవలే విడుదలైన స్త్రీ 2 ఏకంగా రికార్డుల పరంపర కొనసాగిస్తోంది. ఈ రికార్డులను బద్దలు కొట్టేందుకు నేను కూడా రెడీ అంటోంది కన్నడ సోయగం రష్మిక మందన్నా. ఇప్పటిదాకా గ్లామరస్ రోల్స్‌లో మెరిసిన రష్మిక మందన్నా ఇక అందరినీ భయపెట్టిస్తానంటోంది.రష్మిక హిందీ సినిమాకు సైన్ చేసింది. ఈ మూవీకి Vampired of Vijayanagara టైటిల్‌ను ఫిక్స్ చేశారు. Munjya ఫేం ఆదిత్య సర్పోట్‌దర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం రెండు టైమ్ లైన్స్ ఆధారంగా సినిమా ఉండబోతుందట.

# మీ సేవలో కొత్తగా 9 రెవెన్యూ సేవలు

రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల ద్వారా కొత్తగా తొమ్మిది రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. తహసీల్దారు కార్యాలయాల్లో కాకుండా వివిధ ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్ ద్వారా అందించాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నిర్ణయించారు. ప్రస్తుతం తహసీల్దార్లు నేరుగా జారీ చేస్తున్న పత్రాలను ప్రజలు ఆన్‌లైన్‌లో మీ సేవా కేంద్రాల నుంచి పొందేలా చర్యలు చేపట్టారు. తొమ్మిది రకాల పత్రాలకు సంబంధించిన వివరాలు 'మీ సేవ ఆన్ బోర్డ్'లో ఉంచేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం ఆదేశించింది.

మీ సేవ సులభంగా, వేగంగా

మీ సేవ ద్వారా పొందే పత్రాలు
పౌరుల పేరు మార్పిడి
తరచూ జారీ చేసే ఆదాయం, కుల తదితర ధ్రువీకరణ పత్రాలు..
స్థానికత నిర్ధారణ
స్టడీ గ్యాప్ సర్టిఫికెట్
మైనారిటీ ధ్రువీకరణ
క్రీమీలేయర్, నాన్ క్రీమీలేయర్
మార్కెట్ విలువ
ఖాస్రా, పహాణీల వంటి పాత ధ్రువీకరణ పత్రాలు
ఆర్వోఆర్-1(బి) సర్టిఫైడ్ కాపీలు



# ఎలాన్ మస్క్ కు షాక్.. బ్రెజిల్‌లో X నిషేధం

ఎలోన్ మస్క్‌తో వివాదం మధ్య, శుక్రవారం బ్రెజిలియన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి X(ట్విటర్)పై నిషేధం విధించారు. ఎలోన్ మస్క్ సోషల్ మీడియా ప్లాట్ ఫాం Xను సస్పెండ్ చేయాలని ఆదేశించిన న్యాయమూర్తి, కోర్టు ఇచ్చిన గడువులోగా బ్రెజిల్‌లోని తన చట్టపరమైన ప్రతినిధి గురించి సమాచారాన్ని అందించలేదని న్యాయమూర్తి చెప్పారు. బ్రెజిల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డి మోరేస్.. ఎలోన్ మస్క్ మధ్య కొనసాగుతున్న వివాదం మధ్య ఈ నిర్ణయం వచ్చింది. బ్రెజిల్‌లోని శాటిలైట్ ఇంటర్నెట్ ప్రొవైడర్ స్టార్‌లింక్ ఆర్థిక ఖాతాలను స్తంభింపజేయడం కూడా ఇందులో ఉంది. మోరేస్ దానిపై అన్ని సంబంధిత కోర్టు ఉత్తర్వులను పాటించే వరకు దేశంలో Xని తక్షణమే నిషేధించాలని కోర్ట్ ఆదేశించింది. ఇందులో 18.5 మిలియన్ రియాస్ (సుమారు రూ. 27.66 కోట్లు) జరిమానా చెల్లించాలని సూచించింది. బ్రెజిల్‌లో చట్టపరమైన ప్రతినిధి నియామకం చేపట్టాలని కోరింది

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద నీరు

ప్రకాశం బ్యారేజీ మళ్లీ కళకళలాడుతోంది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌ల నుంచి నీటిని విడుదల చేస్తుండ టంతో పులిచింతల గేట్లు పైకెత్తారు. ఎగువ నుంచి బ్యారేజీకి 2,36,169 క్యూసెక్కుల వరద వస్తుండటంతో బ్యారేజీ మూడు గేట్లను పూర్తిస్థాయిలో, మిగిలిన 67 గేట్లను 8 అడుగుల మేర ఎత్తి 3,22,606 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితి మరో రెండు, మూడు రోజులు కొనసాగే అవకాశం ఉంది. ఇక ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ముక్త్యాల వద్ద కృష్ణమ్మ వరద ప్రవాహం పెరిగింది. నది ఒడ్డున ఉన్న ముక్తేశ్వర స్వామి ఆలయం నీట మునిగింది. దీంతో నదీపరివాహక గ్రామాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల్లోని ప్రజలను అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని అప్రమత్తం చేశారు. పులిచింతల ప్రాజెక్టు 40.07 టీఎంసీల నీటితో కళకళలాడుతోంది.


జోరువాన

ప్రకాశం బ్యారేజీ మళ్లీ కళకళలాడుతోంది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌ల నుంచి నీటిని విడుదల చేస్తుండ టంతో పులిచింతల గేట్లు పైకెత్తారు. ఎగువ నుంచి బ్యారేజీకి 2,36,169 క్యూసెక్కుల వరద వస్తుండటంతో బ్యారేజీ మూడు గేట్లను పూర్తిస్థాయిలో, మిగిలిన 67 గేట్లను 8 అడుగుల మేర ఎత్తి 3,22,606 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితి మరో రెండు, మూడు రోజులు కొనసాగే అవకాశం ఉంది. ఇక ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ముక్త్యాల వద్ద కృష్ణమ్మ వరద ప్రవాహం పెరిగింది. నది ఒడ్డున ఉన్న ముక్తేశ్వర స్వామి ఆలయం నీట మునిగింది. దీంతో నదీపరివాహక గ్రామాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాల్లోని ప్రజలను అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని అప్రమత్తం చేశారు. పులిచింతల ప్రాజెక్టు 40.07 టీఎంసీల నీటితో కళకళలాడుతోంది.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సృజన తెలిపారు. వర్షాలకు సంబంధించి జిల్లాలో ఏ సమస్య ఉత్పన్నమైనా 0866-2575833 ఫోన్ నెంబరుకు తెలపాలని కోరారు.

> శ్రీశైలం జలాశయం 9 గేట్లు 10 అడుగుల మేర ఎత్తివేత.
>
> ఇన్ ఫ్లో : 3,27,610 క్యూసెక్కులు
>
> ఔట్ ఫ్లో : 3,21,077 క్యూసెక్కులు
>
> పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు
>
> ప్రస్తుతం: 885 అడుగులు
>
> పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు
>
> ప్రస్తుతం : 215.8070 టీఎంసీలు
>
> కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాలలో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి.



## పెళ్లంటే కేజీఎఫ్ యాక్షన్ డ్రామా

పెళ్లిలో తాను ధరించిన తెల్లని వస్త్రాలను నల్లని గౌన్‌గా మార్చుకున్నది సమంత. అవార్డు షో కోసం డిజైనర్ క్రేషా బజాజ్ ఈ గౌన్‌ని డిజైన్ చేశారు. ఇటీవలే ఈ గౌన్‌ని ఇన్‌స్టాలో షేర్ చేశారు సమంత, క్రేషా బజాజ్. ఇదిలావుంటే.. ఏ విషయాన్నయినా కుండ బద్దలు కొట్టేలా మాట్లాడే సమంత.. ఇటీవల పెళ్లి గురించి ఆసక్తికరమైన కామెంట్స్ చేసింది.పనిలోపనిగా దర్శక, నిర్మాత కరణ్ జోహార్‌ని ఉద్దేశించి ఛలోక్తులు విసిరింది 'సంతోషంగా లేని వివాహాలకు కారకుడు కరణ్‌జోహార్. అతడి దృష్టిలో వివాహం ఆదర్శవంతమైనది. ఆ భావనను, వివాహ లెహంగాలపై తనకున్న మక్కువను తెరపై చూపిస్తుంటాడు. చాలామందికి పెళ్లి విషయంలో అపోహకు కారణం అయ్యాడు. అతను పెళ్లిని 'కభీ ఖుషీ కభీ ఘమ్' అంత అందంగా చూపిస్తాడు. కానీ నిజానికి అది 'కేజీఎఫ్' లాగా యాక్షన్, డ్రామా, సంఘర్షణలతో నిండివుంటుంది' అంటూ ఓ వైపు కరణ్‌ని ఆటపట్టిస్తూనే.. మరోవైపు పెళ్లిపై తన విరక్తిని కూడా ప్రకటించింది సమంత.



## హైదరాబాద్ పబ్బుల్లో దాడులు.. ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అర్ధరాత్రి మరోసారి పబ్బులు, బార్‌లలో పోలీసులు దాడులచేశారు. టీజీనాబ్, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోని 25 పబ్బులపై ఆకస్మిక తనిఖీలు చేశారు. పబ్బుల్లో 107 మందికి అనుమానితులకు డ్రగ్స్ డిటెక్షన్ కిట్లతో పరీక్షలు చేయగా.. ఐదుగురికి పాజిటివ్‌గా తేలింది. శుక్రవారం రాత్రి 11 గంటల నుండి ఒంటి గంట వరకు పోలీసులు తనిఖీలు కొనసాగించారు. ఎక్సోరాలో గంజాయి పరీక్షల్లో ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. రంగరెడ్డి జిల్లాలో బార్‌లలో మరో ముగ్గురు వ్యక్తులు పాజిటివ్‌గా తేలారు. మొదటిసారి తనిఖీల్లో డ్రగ్ డీటెక్షన్ పరీక్షల్లో పాజిటివ్ రావడంతో ఆ వ్యక్తులను టీజీనాబ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరు కేసుల్లో జీ 40లో ఇద్దరికి, విస్కీ సాంబ పబ్బులో ఇద్దరికి, జోరా పబ్బులో ఒకరికి, క్లబ్ రోగ్‌లో ఒకరికి డ్రగ్స్ తీసుకున్నట్లు పాజిటివ్ వచ్చినట్లు అధికారుల తెలిపారు.



## అరకులో 50 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

### అర్ధరాత్రి ఆస్పత్రికి తరలింపు

ఏపీలో మరో దారుణం చోటు చేసుకుంది. అరకులో 50 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. దీంతో అర్ధరాత్రి 50 మంది విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. అరకు డంబ్రిగూడ మండలం బొందుగూడ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల హాస్టల్లో కలుషిత ఆహారం తిని 50 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థతకు గురి కావడం జరిగింది. విద్యార్థినులను అర్ధరాత్రి అరకులోయ ఆసుపత్రికి తరలించారు అధికారులు.కాగా, అల్లూరి జిల్లా డంబ్రి గూడ మండలం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు జిల్లా అధికారులతో మాట్లాడారు. అనారోగ్యంతో అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడారు. వారిని అప్రమత్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

## 7 నుంచి మద్యం షాపులు బంద్

### ఉద్యోగ భద్రత కల్పించాలన్న ఉద్యోగుల సంఘం

ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌పై సెప్టెంబరు 7 నుంచి మద్యం షాపులు బంద్ చేయాలని నిర్ణయించినట్లు ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలిపింది. గత ప్రభుత్వంలో ఇంటర్వ్యూల ద్వారా తమను ఎంపిక చేశారని, ఇప్పుడు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందని పేర్కొంది. ఉద్యోగ భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం స్పందించే వరకు బంద్ కొనసాగిస్తామన్నారు. ఈ మేరకు తమకు న్యాయం చేయాలంటూ ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రారావు, జి. కోటేశ్వరరావు శుక్రవారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ప్రైవేటు మద్యం షాపుల పాలసీ వస్తే 15 వేల మంది రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. మద్యం షాపుల్లో కాకపోయినా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈనెల 4 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కేవలం ఉపాధి కల్పించాలని మాత్రమే కోరుతున్నామన్నారు.





## పాలకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంజెక్షన్ల కొరత

ప్రసవం కోసం వెళ్లిన గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాలకుర్తి మండలంలో ముగ్గురు గర్భిణులకు పురిటి నొప్పులు రాగా స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్సులు గర్భిణులను పరీక్షించి.. ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు వేయాలని ఆస్పత్రిలో లేవని, బయట తెచ్చుకోవాలని సూచించారు. కుటుంబసభ్యులు మెడికల్ షాపుల్లో తెచ్చేందుకు వెళ్లాగా అప్పటికే అర్ధరాత్రి రెండు గంటలు కావడంతో మెడికల్ షాపులు మూసి ఉన్నాయి. చివరకు ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి ఇంజెక్షన్లను తీసుకుని వెళ్లారు.

## శంషాబాద్‌లో దిగిన అతిపెద్ద సరకు రవాణా ఎయిర్ బస్ విమానం

ప్రపంచ దేశాల్లో ఆకాశ తిమింగలంగా పేరుగాంచిన బెలుగా అతి పెద్ద సరకు రవాణా విమానం గురువారం అర్ధరాత్రి తర్వాత శంషాబాద్ విమానాశ్రయంలో మరోసారి దిగింది. ఈ ఎయిర్ బస్ విమానం మస్కట్ నుంచి థాయ్‌లాండ్‌కు సరకు లోడింగ్ కోసం బయల్దేరింది. మార్గ మధ్యలో ఇంధనం నింపుకోవడంతో పాటు క్రూ సిబ్బంది విశ్రాంతి కోసం విమానాన్ని పైలట్ దారి మళ్లించి శంషాబాద్‌లో ల్యాండింగ్ చేశాడు. 15 గంటల తర్వాత అంటే శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బెలుగా యథావిధిగా థాయ్‌లాండ్‌కు బయల్దేరింది. ఈ భారీ లోహ విహంగం 2022 డిసెంబరు, 2023 ఆగస్టులోనూ శంషాబాద్ విమానాశ్రయంలో దిగిందని ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు.




## బంజారాహిల్స్‌లో కారు బీభత్సం.. ఆటో, ఐదు కార్లు ధ్వంసం

నగరంలోని బంజారాహిల్స్‌లో కారు బీభత్సం సృష్టించింది. శనివారం ఉదయం అతివేగంగా దూసుకొచ్చిన ఫార్చునర్ కారు ఓ కమర్షియల్ కాంప్లెక్స్‌లోకి దూసుకెళ్లింది. పార్కింగ్‌లో ఉన్న కారు, ఆటోను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో మరో ఐదు కార్లు ధ్వంసమయ్యాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ప్రమాదానికి కారణమైన కారును మైనర్ బాలుడు నడుపుతున్నట్లు తెలుస్తున్నది. ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వాహనం నంబర్ ఆధారంగా యజమానిని గుర్తించారు.



## హైదరాబాద్‌లో అత్యంత సంపన్నుడు మురళి దివి

హైదరాబాద్‌లో మొత్తం 104 మంది అత్యంత సంపన్నులు ఉన్నట్లు 'హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2024' వెల్లడించింది. దివీస్ ల్యాబొరేటరీ ఫౌండర్ మురళి దివి రూ.76,100 కోట్లతో టాప్‌లో నిలిచారు. ఆ తర్వాత మేఘా కంపెనీకి చెందిన పి.పిచ్చిరెడ్డి రూ.54,800 కోట్లు, పీవీ కృష్ణారెడ్డి రూ.52,700 కోట్లు, హెటిరో ఫౌండర్ పార్థసారథి రెడ్డి రూ.29,900, అపర్ణ సంస్థ ఎండీ సుబ్రమణ్యం రెడ్డి రూ.22,100 కోట్లతో టాప్-5లో ఉన్నారు.

